# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :71 | 27-09- 2026 | ఆదివారం | పేజీలు: 4 | వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TELANGANAVENNELA WAKKU

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో


## డాక్టర్ మన్మోహన్ సింగ్ కి భారతరత్న ఇవ్వాలి

### విప్రో సర్కిల్‌లో స్మారక పార్క్, విగ్రహావిష్కరణ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ బ్యూరో

భారతదేశపు గొప్ప రాజనీతిజ్ఞుడు, ప్రపంచ ప్రసిద్ధ ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రదానం చేసి గౌరవించాలని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సరళీకృత విధానాలతో పాటు తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చి, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి భారతరత్న అందించడంతో పాటు దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ఆయన జ్ఞాపకార్థం సముచితమైన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో స్మారక పార్క్, విగ్రహావిష్కరణ

హైదరాబాద్‌లోని ఐటీ రంగానికి కేంద్రమైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ విప్రో సర్కిల్ వద్ద హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (నవీణూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ స్మారక పార్క్‌ను, ఆయన కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి గారు ఘనంగా ఆవిష్కరించారు.



ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ కేంద్ర ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, పార్లమెంట్ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, శాసనసభ్యులు అరికపూడి గాంధీ, నవీన్ యాదవ్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విప్లవాత్మక చట్టాల ద్వారా దేశ సమగ్ర వికాసం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రగతికి మన్మోహన్ సింగ్ గారు అందించిన అమూల్యమైన సేవలను గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలో తీసుకువచ్చిన ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత హక్కు చట్టం, ఆదివాసీ అటవీ హక్కుల చట్టం, భూసేకరణ మరియు పునరావాస చట్టం వంటి విప్లవాత్మక శాసనాలను సీఎం ప్రస్తావించారు.

ఆర్థిక సంక్షోభం

మిగతా వివరాలు రెండో పేజీలో..

## ఓటర్ నమోదులో అక్రమాలే ఎజెండా!

### సీఈసీపై చర్యకు కాంగ్రెస్ డబ్ల్యూసీ తీర్మానం?

న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఓటర్ల నమోదు, జాబితాల సవరణ ప్రక్రియలో అధికార పార్టీకి అనుకూలంగా జరుగుతున్న అక్రమాలే ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ అత్యున్నత నిర్ణయాత్మక మండలి 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ' సమావేశం ఈ నెల 29న ఢిల్లీలో జరగనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలి, ఇతర కమిషనర్లను సంప్రదించకుండా ఆయన తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. సీఈసీపై రాజ్యాంగపరమైన, చట్టపరమైన చర్యలకు డిమాండ్ చేస్తూ ఒక ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

29న కీలక భేటీ.. రాజకీయ వర్గాల్లో ఆసక్తి

కేంద్ర ఎన్నికల సంఘం వైఖరిపై, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో జరుగుతున్న అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే దేశవ్యాప్తంగా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 29న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన, అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో జరగనున్న సీడబ్ల్యూసీ భేటీపై దేశ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పిసిసి అధ్యక్షులు, సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితులు హాజరుకానున్నారు.

సమావేశంలో చర్చించనున్న ప్రధాన అంశాలు

ఓటర్ల నమోదు ప్రక్రియలో, ఫారమ్-6 నిబంధనల మార్పులలో మరియు అర్హులైన ప్రతిపక్ష వర్గాల ఓటర్ల పేర్లను డిలీట్ చేయడంలో చోటుచేసుకున్న సాంకేతిక అక్రమాలను పూర్తి ఆధారాలతో ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. పారదర్శకతకు పెద్దపీట వేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై తక్షణమే విచారణ జరిపించాలని మరియు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కీలక తీర్మానం చేయడానికి సమాయత్తమవుతోంది. అలాగే త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాలలో ఎన్నికల సంఘం తీరుపై నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఇండియా కూటమి (×చీణ×ూ దీశ్రీశీఎ) లోని భాగస్వామ్య పక్షాలన్నింటినీ సమన్వయం చేసుకోవాలని యోచిస్తోంది. ఎన్నికల సంఘం నిష్పాక్షికతను కాపాడేందుకు కలెక్టరేట్ల ముట్టడి నుంచి ఢిల్లీ స్థాయిలో చేపడుతున్న ప్రజా ఆందోళనలను మరింత తీవ్రతరం చేయడానికి ఈ వేదిక ద్వారా సమగ్ర వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు.

ప్రతిపక్షాల గళానికి తోడవుతున్న ఒత్తిడి

ఈసీఐ నిర్ణయాల వల్ల కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్ల హక్కులు కాలరాస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే డీకే శివకుమార్ వంటి సీనియర్ నేతలు సీఈసీని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తుంటే, ఎన్డీయే మిత్రపక్షాలైన టీడీపీ, ఎల్జేపీలు కూడా ఈసీ




వివరణ ఇవ్వాలని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ ఆమోదించే తీర్మానం కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై మరింత ఒత్తిడిని పెంచనుంది. ప్రజాస్వామ్య మూలాలకే ముప్పుగా మారిన ఈ ఓటర్ల నమోదు అక్రమాలను ఎండగట్టడానికి ప్రాంతీయ పార్టీలను కలుపుకొని సమరశంఖం పూరించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ వివాదం మరింత తీవ్రరూపం దాల్చే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## అంతు చూస్తానంటావా?'

### సజ్జనార్‌పై కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు.. పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంచలన కౌంటర్!

హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన హెచ్చరికలు, వివాదాస్పద వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ మరియు ఐపీఎస్ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఐపీఎస్ అధికారిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటూ, "అంతు చూస్తాం, సప్త సముద్రాల వెనకున్నా తీసుకొచ్చి తాట తీస్తాం" అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించడాన్ని తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్ర స్థాయిలో ఖండించింది.




మిగతా వివరాలు రెండో పేజీలో..

## ఈసీఐని తక్షణం పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలి

### కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ డిమాండ్!



బెంగళూరు

కేంద్ర ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో రాజ్యాంగబద్ధమైన ఎన్నికల వ్యవస్థను, పారదర్శకతను కాపాడాలంటే ప్రస్తుత ఈసీఐని తక్షణమే పదవి నుంచి తొలగించడమే కాకుండా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ సంస్థల్లో ఇటువంటి అక్రమాలు, ఏకపక్ష నిర్ణయాలు కొనసాగితే దేశ ప్రజాస్వామ్యానికే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వివాదాస్పద నిర్ణయాలను వెంటనే పునఃపరిశీలించాలి

ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన డీకే శివకుమార్, కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలి కాలంలో తీసుకున్న అనేక కీలక నిర్ణయాలు తీవ్ర సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చేపట్టిన మార్పులు, సాఫ్ట్‌వేర్ నియమాల్లో తీసుకువచ్చిన ఏకపక్ష సవరణలు పారదర్శకతకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఇటీవల తీసుకున్న అన్ని వివాదాస్పద నిర్ణయాలను, గైడ్‌లైన్స్‌ను తక్షణమే పునఃపరిశీలించాలని, తద్వారా ఓటర్ల హక్కులను మరియు ప్రజాస్వామ్య సూత్రాలను రక్షించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల నిర్వహణ విభాగంలో జవాబుదారీతనం లోపించడం ఏమాత్రం సహించరానిదని ఆయన స్పష్టం చేశారు.

'ఓటు చోరీ'పై వెల్లువెత్తుతున్న ఆరోపణలు.. దేశవ్యాప్త నిరసనలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్లను సైతం సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఓటర్ల జాబితాల నుండి లక్షలాది మంది అర్హులైన పౌరుల పేర్లను తొలగించే కుట్రలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు గత కొన్ని రోజులుగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్న విషయం తెలిసిందే. లోక్‌సభ మరియు వీధి పోరాటాల ద్వారా తమ నిరసన గళాన్ని బలంగా వినిపిస్తున్నాయి. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉమ్మడి నిర్ణయాధికారాన్ని పక్కనబెట్టి నిర్ణయాలు తీసుకున్నందున, దీనిపై సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకోవాలని ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు. డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు ఈ పోరాటంలో మరింత వేడిని పెంచాయి.

ఎన్డీయే మిత్రపక్షాల సందేహాలు.. మోదీ ప్రభుత్వ నిశ్శబ్దం

ఒకవైపు విపక్షాలు, కాంగ్రెస్ శ్రేణులు సీఈసీ రాజీనామా కోసం విజ్ఞప్తులు చేస్తుంటే, మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం పార్టీ, లోక్ జనశక్తి పార్టీ వంటి భాగస్వామ్య పక్షాలు కూడా సీఈసీ నుంచి పారదర్శకమైన వివరణ కావాలని కోరడం ఈ వివాదంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం ఉండకూడదని, వెంటనే కమిషన్ ప్రకటన చేయాలని మిత్రపక్షాలే డిమాండ్ చేస్తున్నప్పటికీ, నరేంద్ర మోదీ ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలపై మౌనం వహించడం పలు అనుమానాలకు ఆజ్యం పోస్తోంది.

ప్రజాస్వామ్య విశ్వసనీయతపై ముప్పు

ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసమే భారత ప్రజాస్వామ్యానికి ప్రధాన బలం. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్య తీర్పుకు విలువ ఉంటుంది. కానీ, ప్రస్తుత సీఈసీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య హక్కులను తొక్కిపెట్టేలా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డీకే శివకుమార్ చేసిన ఈ సంచలన కామెంట్లతో రాజ్యాంగ వ్యవస్థల రక్షణపై జరిగే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయడానికి ప్రతిపక్షాలు సమాయత్తమవుతున్నాయి. రాబోయే రోజుల్లో అన్ని జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి ఎన్నికల సంఘం అక్రమాలను ఎండగడతామని కాంగ్రెస్ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి.

తెలంగాణ
వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


## రాష్ట్ర స్థాయి వైటీసీ పోటీల్లో నిర్మల్ విద్యార్థుల ప్రతిభ




నిర్మల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజన పర్యాటక క్లబ్ (వైటీసీ) పోటీల్లో నిర్మల్ జిల్లా విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. కళాశాలల విభాగం నృత్య పోటీలలో నిర్మల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎం. యోగిత, ఆర్. పూజ, జె. గంగోత్రి, చాకోల, వైభవలక్ష్మి, సమీత, దుర్గాదేవి, ఎ. వైష్ణవి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. అలాగే పాఠశాలల విభాగంలో ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎం. వరలక్ష్మి, ఆర్. శృతి, ఎం. రక్షిత, ఎ. సంజన, ఎం. రమ్య, కె. మనోజ్ఞ, కె. అనన్య, ఎం. వైష్ణవి విశేష నృత్య ప్రదర్శనతో కన్సోలేషన్ బహుమతిని కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు గుర్తింపు తెచ్చిన విద్యార్థినులను విద్యాశాఖ అధికారులు, అధ్యాపక బృందం ఘనంగా అభినందించారు.

## చుచుంద్‌లో గౌతమ బుద్ధుని విగ్రహ ప్రతిష్ఠాపన



భైంసా/ముధోల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రతిఫలాన్ని ఆశించకుండా తోటివారికి సహాయం చేయడమే నిజమైన దానమని, బుద్ధుని దాన పారమిత ద్వారానే సమాజంలో మానవతా విలువలు పెంపొందుతాయని బౌద్ధ భిక్షువులు పేర్కొన్నారు. భైంసా మండలం చుచుంద్ గ్రామంలో శనివారం గంగారాం గడపాలే నివాసంలో బౌద్ధ భిక్షువులు దీపరత్న, ప్రజ్ఞానామల ఆధ్వర్యంలో తథాగత గౌతమ బుద్ధుని విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ కార్యదర్శి బి.ఎం. కాంబ్లే, రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే, జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు హాజరయ్యారు. బుద్ధుని బోధనలు శాంతి, సమానత్వానికి ప్రతీకలని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కిషన్‌రావు, శాంతారాం, ఆనందరావు, శుద్ధోధన్ పాల్గొన్నారు.

## ముధోల్ ఎంపీడీవో కార్యాలయంలో నీటి భద్రతపై సదస్సు



ముధోల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): భూగర్భ జలాల పరిరక్షణ, గ్రామీణ నీటి భద్రతపై ప్రతి పంచాయతీ పటిష్ట కార్యాచరణ రూపొందించాలని అధికారులు పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ముధోల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సాంకేతిక సిబ్బందికి ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే ముప్పు ఉన్నందున వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలను గ్రామ ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నమూనా రీఛార్జ్ పిట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలింపజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి బట్టేకర్ లక్ష్మణ్, ఎంపీడీవో లవకుమార్, ఎంఈవో రమణారెడ్డి, ఏపీవో శిరీష పాల్గొన్నారు.

## వర్షావాస దీక్షలో భాగంగా ఉద్గీర్‌కు బౌద్ధ ఉపాసకుల యాత్ర



ముధోల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): వర్షావాస దీక్షా కాలాన్ని పురస్కరించుకుని ముధోల్, తానూర్, భైంసా, కుబీర్ మండలాలకు చెందిన 150 మంది బౌద్ధ ఉపాసకులు, ఉపాసికలు మహారాష్ట్రలోని ప్రముఖ ఉద్గీర్ బుద్ధ విహార్ దర్శనార్థం ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించారు. భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ వాగ్మేర్ నేతృత్వంలో ఈ యాత్ర సాగుతోంది. మూడు నెలల పాటు సాగే పవిత్ర వర్షావాస కాలంలో అష్టాంగ శీలాన్ని ఆచరిస్తూ గోలేగాం తపోభూమి, అహ్మద్‌నగర్ మీదుగా యాత్ర ఉద్గీర్ చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా శివరాం

ముధోల్, సెప్టెంబర్ 26: నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ముధోల్ మండలం చించాల గ్రామానికి చెందిన శివరాం నియమితులయ్యారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శివరాంను ఆత్మీయంగా సన్మానించారు.
పార్టీ నాయకులు శివరాంకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన పార్టీ పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఓబీసీ మోర్చా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఉమ్మడి ఆదిలాబాద్‌లో దడ పుట్టిస్తున్న ఆర్టీసీ పోరు!

- నిర్మల్ కోటపై విపక్షాల ఉమ్మడి దాడి..!
- 'బస్సు, బాణం, కాగడా' కూటమి ప్రభంజనం!




నిర్మల్ సెప్టెంబర్ తెలంగాణ వెన్నెల వాక్కు
ఆసిఫాబాద్ కొండల నుంచి మొదలుకొని మంచిర్యాల గనుల దాకా, నిర్మల్ డిపో కేంద్రంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు యూనియన్ ఎన్నికల సెగ తీవ్ర స్థాయికి చేరింది. సుదీర్ఘ కాలం తర్వాత రాబోయే అక్టోబర్ తొమ్మిదవ తేదీన జరగనున్న ఈ సమరంలో విజయం సాధించడమే లక్ష్యంగా కార్మిక క్షేత్రంలో వ్యూహ ప్రతివ్యూహాలు షురూ అయ్యాయి. ఈ ఎన్నికల రణరంగంలో శత్రువులను దెబ్బతీయడానికి, కార్మికుల సంక్షేమమే పరమావధిగా ఎంప్లాయిస్ యూనియన్ , తెలంగాణ మజ్దూర్ యూనియన్ (ం.వీ.ఖ), నేషనల్ మజ్దూర్ యూనియన్ కలిసి చారిత్రాత్మక మహా కూటమిగా అవతరించడం ప్రత్యర్థి వర్గాల్లో వణుకు పుట్టిస్తోంది. ఐక్యతతో కూడిన ఈ త్రిముఖ వ్యూహం జిల్లాలోని ప్రతి డిపోలోనూ సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపింది.
ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని కార్మిక శక్తినంతా ఒకే తాటిపైకి తెచ్చేందుకు ఈ మహా కూటమి శ్రమిస్తోంది. రీజియన్ వ్యాప్తంగా ఉన్న విభిన్న డిపోలలో కలిపి మొత్తం ఒక వెయ్యి ఏడువందల డెబ్బై మూడు మంది ఓటర్లు తమ భవిష్యత్తును నిర్ణయించనున్నారు. ప్రధానంగా మంచిర్యాల డిపోలోని నాలుగువందల మూడు ఓట్లు, ఆదిలాబాద్ డిపోలోని మూడువందల తొంబై ఎనిమిది ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. వీటితో పాటు ఆసిఫాబాద్‌లో రెండువందల యాభై ఒక్క ఓట్లు, భైంసాలో నూట తొంబై మూడు ఓట్లు, ఉట్నూరులో నూట పదకొండు ఓట్లు, అలాగే ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో మరో ముప్పై రెండు ఓట్లు ఉన్నప్పటికీ.. అందరి దృష్టిని ఆకర్షిస్తున్న అసలు సిసలైన రణరంగం మాత్రం నిర్మల్ డిపోగానే మారింది.
నిర్మల్ డిపో పరిధిలో ఉన్న మొత్తం మూడువందల ఎనభై ఐదు ఓట్ల గణాంకాలను పరిశీలిస్తే, కూటమి సాధించిన విప్లవాత్మక ఐక్యత స్పష్టంగా అర్థమవుతుంది. ఇక్కడ ప్రత్యర్థి వర్గాలైన బిఎమ్ఎస్ యూనియన్‌కు కేవలం పది మంది సభ్యులు, ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు ముప్పై మంది మద్దతుదారులు మాత్రమే ఉన్నారు. మిగిలిన సింహభాగం ఓట్లన్నీ కూటమి వైపే మొగ్గు చూపుతుండటం విశేషం. ఎంప్లాయిస్ యూనియన్‌కు స్పష్టమైన పునాదిగా తొంబై ఐదు మంది బలమైన కార్మిక సభ్యత్వం ఉంది. దీనికి తోడు తెలంగాణ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల బలగాలు చేతులు కలపడంతో నిర్మల్ డిపోలో ప్రత్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదని కార్మిక వర్గాలు చర్చించుకుంటున్నాయి.
ఈ రాజకీయ ఏకీకరణ వెనుక ఉన్న బలమైన ఉద్దేశం కార్మికుల హక్కుల పరిరక్షణేనని కూటమి శ్రేణులు గంభీరంగా ప్రకటిస్తున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయడం, కార్మికుల వేతన బకాయిలు, పెండింగ్ సమస్యలు, ఉద్యోగ భద్రత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రచారంలో భాగంగా ఎంప్లాయిస్ యూనియన్‌కు చెందిన 'బస్సు' గుర్తు, తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు చెందిన 'బాణం' గుర్తు, నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు చెందిన 'కాగడా' గుర్తు కార్మికుల నోళ్లలో నానుతున్నాయి. ఈ మూడు గుర్తుల మేళవింపుతో కూటమి ఊహించని రీతిలో ముందంజలో ఉంది. కార్మికుల ఆత్మగౌరవ పోరాటానికి సిద్ధమై, ప్రత్యర్థుల ఎత్తుగడలను తిప్పికొడుతూ బస్సు, బాణం, కాగడా గుర్తులపై ఓట్లు గుద్ది ఏకపక్ష మెజార్టీతో చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టాలని డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ జి. రాజేశ్వర్ ఆదిలాబాద్ రీజియన్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కార్మికుల ఐక్యతే వారి భవిష్యత్తుకు శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు.

## దేవుడి దగ్గరికి వెళ్లి.. మన కోరికలే ఎందుకు మర్చిపోతాం?

దేవాలయానికి వెళ్లినప్పుడు మనసులో ఎన్నో కోరికలు ఉంటాయి. ఇంటి సమస్యలు, పిల్లల భవిష్యత్, ఆరోగ్యం, ఉద్యోగం, వ్యాపారం, అప్పులు.. ఇలా ఒక్కొక్కరి మనసులో ఒక్కో ఆలోచన ఉంటుంది. దేవుడి సన్నిధికి చేరుకునే వరకు ఏం అడగాలో కూడా మనసులో సిద్ధం చేసుకుంటాం. కానీ గర్భగుడి ముందు నిలబడి దేవుడి రూపాన్ని చూసిన క్షణంలో మాత్రం.. మాటలు రావు. కొద్దిసేపు మౌనంగా నిలబడి తిరిగి వస్తాం. ఎందుకిలా జరుగుతుంది?
మనిషి తన బాధను అందరికీ చెప్పగలడు. కానీ తన మనసులోని ప్రతి మాటను చెప్పగలిగే స్థలం మాత్రం దేవుడి సన్నిధి. అందుకే దేవుడి ముందు నిలబడినప్పుడు మాటల కంటే మౌనమే ఎక్కువగా మాట్లాడుతుంది. మనం చెప్పలేని బాధను కూడా దేవుడు అర్థం చేసుకుంటాడనే నమ్మకమే ఆ మౌనానికి కారణం.
కొన్నిసార్లు మనం కోరుకున్నది దక్కాలని దేవుడిని అడుగుతాం. కానీ కాలం గడిచిన తర్వాత వెనక్కి చూసుకుంటే.. అప్పట్లో దక్కనిది కూడా మన జీవితానికి మంచిదే అయి ఉండొచ్చని అర్థమవుతుంది. అందుకే ప్రార్థన అంటే కేవలం "నాకు ఇది ఇవ్వాలి" అని అడగడం మాత్రమే కాదు.. "నాకు ఏది మంచిదో అది జరగాలి.. దాన్ని స్వీకరించే శక్తిని నాకు ఇవ్వాలి" అని కోరుకోవడం కూడా.దేవుడి ముందు నిలబడినప్పుడు మన సమస్యలు వెంటనే పరిష్కారం కాకపోవచ్చు. కానీ మనసులోని భారాన్ని కొంత తగ్గించుకుని బయటకు రావచ్చు. అదే భక్తి ఇచ్చే మొదటి ధైర్యం. సమస్యను ఎదుర్కొనే మనసు మారితే.. పరిష్కారం వైపు వెళ్లే మార్గం కూడా కనిపించవచ్చు.అందుకే రేపు దేవాలయానికి వెళ్లినప్పుడు ఒక చిన్న ప్రయోగం చేయండి. మీ కోరికలన్నీ వరుసగా చెప్పకుండా.. కొన్ని క్షణాలు మౌనంగా దేవుడి వైపు చూడండి. ఆ తర్వాత ఒక్క మాట మాత్రమే చెప్పండి.. "స్వామీ.. నాకు ఏది కావాలో నీకు తెలుసు. దాన్ని పొందే శక్తి, ఎదుర్కొనే ధైర్యం నాకు ఇవ్వు" అని.
కోరికలు అడగడానికి దేవుడి దగ్గరకు వెళ్లడం సహజం. కానీ దేవుడి ముందు నిలబడి మనసును ప్రశాంతం చేసుకుని తిరిగి రావడం.. భక్తి మనకు ఇచ్చే గొప్ప వరం. మనం దేవుడి దగ్గరకు వెళ్లేది సమస్యలన్నీ మాయమవ్వాలని మాత్రమే కాదు.. వాటిని ఎదుర్కొనే మనసు మరింత బలంగా మారాలని కూడా.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## డాక్టర్ మన్మోహన్ సింగ్ కి భారతరత్న ఇవ్వాలి

నుంచి ప్రపంచ శక్తులుగా ఎదిగేలా...
దేశంలో విదేశీ మారక నిల్వలు పూర్తిగా క్షీణించి, ఆర్థిక వ్యవస్థ చితికిపోయిన కష్టకాలంలో ఆనాటి ప్రధాని పి.వి. నరసింహారావు మార్గదర్శకత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు తన అపార అనుభవాన్ని ధారపోశారని తెలిపారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు దేశ రూపురేఖలను మార్చేశాయని, అద్భుతమైన అందించాయని గుర్తుచేశారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన ఆయన జీవితం, త్యాగనిరతి నేటి నవతరం యువతకు దేశభక్తి స్ఫూర్తిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో పార్క్ ఏర్పాటు సముచితం
హైదరాబాద్ నగరంలో దిగ్గజ అంతర్జాతీయ సాంకేతిక సంస్థలతో పాటు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దాదాపు 40 శాతానికి పైగా బలాన్ని చేకూర్చే ప్రాంతంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి విగ్రహాన్ని, స్మారక పార్క్‌ను నెలకొల్పడం ఎంతో సముచితమని సీఎం అభిప్రాయపడ్డారు.
తెలంగాణ చరిత్రలో నిజాం పాలన నుంచి విముక్తి పొంది హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడటం మొదటి ఘట్టమైతే, సమైక్య పాలన నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించడం రెండో ఘట్టమని అన్నారు. ఆనాడు జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్ భాయి పటేల్ సైనిక చర్య ద్వారా స్వేచ్ఛను అందిస్తే, ఆ తర్వాత శ్రీమతి సోనియా గాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ గార్ల నాయకత్వంలో 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, త్యాగాల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర స్వప్నం నెరవేరిందన్నారు.
పార్క్ ప్రత్యేకత – ఎంపీలకు సీఎం పిలుపుప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై ప్రధాని హోదాలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పెట్టిన చారిత్రాత్మక సంతకాన్ని ఈ పార్క్‌లో ప్రత్యేకంగా నిక్షిప్తం చేయడం జరిగింది. సందర్శకులకు ఆయన స్వదస్తూరి సంతకం స్పష్టంగా కనిపించేలా ముద్రించారు. దేశం గర్వించదగిన ఈ జాతిరత్నాన్ని రాజకీయాంశాల నేపథ్యంలో గుర్తించకపోవడం విషాదకరమని, రాజకీయాలను మించి మహనీయుల సేవలను స్మరించుకోవాలని సీఎం అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు బలమైన పునాదులు వేసిన ఈ మౌనమునికి భారతరత్న ఇవ్వాలని, ఈ

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# కుస్లీలో అభాగ్య కుటుంబాలకు ఫ్రెండ్స్ యూత్ నిత్యావసరాల పంపిణీ



నర్సాపూర్ (జి), సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): నర్సాపూర్ (జి) మండలంలోని కుస్లీ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఇద్దరు నిరుపేద మహిళల కుటుంబాలకు అండగా నిలిచి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. భర్తను కోల్పోయి చిన్నారి కుమారుడితో జీవిస్తున్న దమ్మక్క, అలాగే రేషన్ కార్డు లేక మానసిక స్థితి సరిగా లేని సునీత కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను యూత్ సభ్యులు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవతా ధర్మమని సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ ప్రతినిధులు శ్యాంసుందర్, సవీన్, సందీప్, చరణ్, ఆర్ఎంపీ గజేందర్, నవీన్, పవన్, వినేష్, నితిన్, ఆదిత్య పాల్గొన్నారు.

## ముధోల్ ఏఆర్ఎస్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు




ముధోల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్‌లోని వ్యవసాయ పరిశోధనా స్థానం (ఏఆర్ఎస్)లో శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆకుల దినేష్, డాక్టర్ రాహుల్ విశ్వకర్మ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ విముక్తి పోరాటంలో ఐలమ్మ చూపిన తెగువ, పోరాట పటిమ సమాజానికి నిరంతర స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో పరిశోధనా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న దుడోల్ల సరీల్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు



లోకేశ్వరం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దుడోల్ల సరీల్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం స్వగ్రామానికి చేరుకోగా, మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కరిపే శ్యాంసుందర్ శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సరీల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాగర్, సాయన్న, తోట సంజు, మాజీ సర్పంచ్ దిగంబర్, నాయకులు అనిల్, ప్రవీణ్, ఓంకార్, దేవేందర్ పాల్గొన్నారు.

## పంచగుడి గోదావరి వంతెన వద్ద ఘనంగా వినాయక నిమజ్జనాలు



లోకేశ్వరం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): లోకేశ్వరం మండల పరిధిలోని పంచగుడి గోదావరి నది వంతెన సమీపంలో వినాయక నిమజ్జన వేడుకలు శనివారం అత్యంత వైభవంగా సాగాయి. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిర్వాహకులు భారీ క్రేన్లను ఏర్పాటు చేసి క్రమపద్ధతిలో విగ్రహాలను నదిలోకి దించారు. భక్తులు 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో లంబోదరుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. రెండు జిల్లాల నుంచి వాహనాలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.

## సరస్వతీ శిశు మందిర్‌లో 'ఏక్ పేడ్ మా కే నామ్'



ముధోల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం కేంద్ర ప్రభుత్వ 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లుల పేరుతో పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో కీలకమని ప్రధానాచార్యులు సారథి రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు ముత్యాల కిషన్, పాఠశాల అధ్యక్షుడు కొండావార్ సంజీవ్, కార్యదర్శి నిశికాంత్, దర్బార్ నవీన్, కంది దత్తాత్రి, సంజయ్ పాండే పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో 'శివంగి'

### మూడేళ్లుగా ప్రశాంత వాతావరణం.. పటిష్ట నిఘాతో ముందుకు

## నిర్మల్, భైంసాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు వ్యూహాత్మక పోలీసింగ్

నిర్మల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):

**ఒకప్పుడు ఉద్రిక్తతలు, ఆకస్మిక అలజడులతో వార్తల్లో నిలిచిన ప్రాంతాల్లో ఇప్పుడు ప్రశాంత వాతావరణం నెలకొంటోంది. పండుగలు, మతపరమైన కార్యక్రమాలు సోదరభావం, పరస్పర సహకారంతో సాగుతున్నాయి. ముఖ్యంగా నిర్మల్, భైంసా పట్టణాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ శాఖ ముందస్తు ప్రణాళిక, పటిష్ట నిఘా, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలతో సమన్వయాన్ని ప్రధాన ఆయుధాలుగా మలుచుకుంది.**

**ఈ మార్పులో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ నాయకత్వం ప్రత్యేకంగా కనిపిస్తోంది. సున్నితమైన ప్రాంతాల్లో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన బందోబస్తు, నిఘా ఏర్పాట్లు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించడం ఆమె విధానంలో ప్రధానంగా నిలుస్తోంది.**

**గణేష్ నిమజ్జనానికి భారీ బందోబస్తు**

నిర్మల్ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్వయంగా బ్రీఫింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, సున్నిత ప్రదేశాల వద్ద నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు.

సుమారు 700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రతి విభాగానికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచారు.

**సాంకేతిక నిఘాతో మరింత పటిష్ట భద్రత**

నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని ఎనిమిది సెక్టార్లుగా విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 106 సీసీ కెమెరాలు, నాలుగు డ్రోన్ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు.



పోలీసుల ప్రత్యక్ష బందోబస్తుతో పాటు సాంకేతిక నిఘాను సమన్వయం చేయడం ద్వారా ఎలాంటి చిన్న ఘటన చోటుచేసుకున్నా వెంటనే గుర్తించి స్పందించే విధంగా ఏర్పాట్లు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయి పోలీసింగ్‌తో అనుసంధానం చేయడం ద్వారా భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు.

**భైంసాలో శాంతి.. సామరస్యానికి ప్రతీకగా నిమజ్జనం**



గతంలో సున్నిత ప్రాంతంగా గుర్తింపు పొందిన భైంసా పట్టణంలోనూ గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా ముగిసింది. భారీ పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘాతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించారు.

ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్వయంగా శోభాయాత్ర మార్గాల్లో పర్యటిస్తూ బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పోలీసుల విధులను పరిశీలించారు. మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించడంతో నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగింది.

**ముందస్తు ప్రణాళికే కీలకంగా..**

శాంతిభద్రతల పరిరక్షణలో ఘటన జరిగిన తర్వాత స్పందించడం కంటే, ఘటనకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టడానికే పోలీస్ శాఖ ప్రాధాన్యం ఇస్తోంది. సున్నిత ప్రాంతాలను గుర్తించడం, సమస్యలకు కారణమయ్యే అంశాలపై నిఘా ఉంచడం, స్థానిక ప్రజలు, మత పెద్దలు, యువత, ఉత్సవ కమిటీలతో సమన్వయం చేయడం ద్వారా పరిస్థితులను అదుపులో ఉంచుతున్నారు.

ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచడంతో పాటు, అన్ని వర్గాల మధ్య సామరస్యాన్ని ప్రోత్సహించే చర్యలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో ఎస్పీ పర్యవేక్షణ**

ఎస్పీ జానకి షర్మిల విధానంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం కనిపిస్తోంది. సున్నితమైన సందర్భాల్లో పోలీస్ అధికారులతో సమీక్షలు నిర్వహించడం, బందోబస్తు ప్రాంతాలను స్వయంగా పరిశీలించడం, సిబ్బందికి దిశానిర్దేశం చేయడం ద్వారా అప్రమత్తతను పెంచుతున్నారు.

శాంతిభద్రతలు కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల సహకారం కూడా కీలకమనే భావనతో పోలీస్ శాఖ ముందుకు సాగుతోంది. ఈ విధానంలో ప్రజలు, ఉత్సవ కమిటీలు, మత పెద్దలు, పోలీసుల మధ్య సమన్వయం ప్రధానంగా మారింది.

**'శివంగి'తో బలమైన స్పందనా వ్యవస్థ**

జిల్లా పోలీస్ శాఖలో 'శివంగి' బృందాల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే వ్యవస్థను కూడా బలోపేతం చేస్తున్నారు. శాంతిభద్రతల విధులతో పాటు అత్యవసర సమయాల్లో క్షేత్రస్థాయిలో వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాల సేవలను వినియోగిస్తున్నారు.

మొత్తంగా నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందస్తు ప్రణాళిక, సాంకేతిక నిఘా, భారీ బందోబస్తు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, ప్రజలతో సమన్వయం ప్రధాన స్తంభాలుగా మారాయి.

**ఒకప్పుడు ఉద్రిక్తతలతో వార్తల్లో నిలిచిన ప్రాంతాల్లో పండుగలు ప్రశాంతంగా జరిగే పరిస్థితి ఏర్పడటం వెనుక పోలీసుల నిరంతర అప్రమత్తతతో పాటు ప్రజల సహకారం కూడా కీలకంగా నిలుస్తోంది. ఈ క్రమంలో ఎస్పీ డా. జి. జానకి షర్మిల నాయకత్వంలో నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు చర్యలకు మరింత ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోంది.**

# సిఈసి తొలగింపుకు మోదీ సర్కార్ నైతిక భయం!?

## అసలు 'ఓటు చోరీ' నిజమేనా?

### రాజ్యాంగ వ్యవస్థల ఉనికికే ముప్పు తెస్తున్న వివాదాలు.. ప్రతిపక్షాల ఆక్రోశంపై కేంద్రం నిశ్శబ్దం రాజకీయాంశమేనా?

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక వంటిది కేంద్ర ఎన్నికల కమిషన్. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ గర్వంగా నిలబడటానికి నిష్పాక్షికమైన, స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వహణే మూలకారణం. పారదర్శకమైన ఎన్నికల వ్యవస్థ ఉన్నప్పుడే ప్రజలు ఇచ్చే తీర్పుకు నిజమైన నైతిక విలువ ఉంటుంది. అయితే, ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ ( సి ఈ సి) జ్ఞానేష్ కుమార్‌పై ప్రతిపక్షాలు గుప్పిస్తున్న తీవ్రమైన ఆరోపణలు, ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని లేదా ఆయన చేత రాజీనామా చేయించాలని పట్టుబడుతున్న తీరు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు, చర్చకు దారితీస్తోంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారనే ప్రధాన ఆరోపణ ఇప్పుడు దేశ రాజకీయాల్లో పెను తుఫాను సృష్టిస్తోంది. ఫారమ్-6లలో నిబంధనలకు విరుద్ధంగా చేసిన మార్పులు, డిజిటల్ వ్యవస్థలు మరియు సాఫ్ట్‌వేర్‌లో చేసిన రహస్య మార్పులు, తద్వారా లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారనే అంశాలు తీవ్రమైన గందరగోళాన్ని కలిగిస్తున్నాయి. విపక్షాలు పార్లమెంట్ లోపల, బయట వీధిపోరాటాలు చేస్తుంటే, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిశ్శబ్ద వైఖరి పలు అనుమానాలకు తావిస్తోంది.

**స్వతంత్రతపై దెబ్బ...ప్రతిపక్షాల తీవ్ర ఆరోపణలు**

స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన రాజ్యాంగబద్ధ వ్యవస్థలు అధికార పీఠానికి అనుకూలంగా మారకూడదనేది ప్రతిపక్షాల గంభీరమైన వాదన. ఎన్నికల కమిషన్ తన స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి, అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని ప్రతిపక్ష నాయకులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా, ముగ్గురు సభ్యులు ఉండే ఎన్నికల కమిషన్‌లో మిగిలిన ఇద్దరు కమిషనర్ల అభిప్రాయాలను, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారనే అంశం సుప్రీంకోర్టు తలుపు తట్టడం ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం.

రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్‌లో నిర్ణయాలు ఉమ్మడి బాధ్యతతో జరగాలి. కానీ, దానికి విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయాలు అమలు చేయడం వల్ల ఓటర్ల హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒక నిర్దిష్ట వర్గాన్ని లేదా ప్రాంతపు ఓటర్లను లక్ష్యంగా చేసుకుని జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది కేవలం ఒక అధికారి చేసిన పరిపాలనాపరమైన తప్పు కాదని, ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్య మూలాలపై జరుగుతున్న 'ఓటు చోరీ'యేనని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి.

**సీఈసీని తొలగించేందుకు కేంద్రానికి ఉన్న నైతిక భయం?**

ప్రతిపక్షాల నుండి ఇంత పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్‌ను తొలగించడానికి లేదా ఆయనపై స్వతంత్ర విచారణకు ఆదేశించడానికి వెనుకాడటానికి బలమైన రాజకీయ, నైతిక కారణాలు ఉన్నాయి. ఈ దశలో సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగిస్తే లేదా ఆయన చేత రాజీనామా చేయిస్తే.. అది ప్రతిపక్షాలు చేస్తున్న "ఓటు చోరీ" ఆరోపణలను స్వయంగా నిజమని ఒప్పేసుకున్నట్లవుతుందనే తీవ్ర భయాందోళనలో అధికార బీజేపీ నాయకత్వం ఉంది.ఇటీవల తీసుకొచ్చిన కేంద్ర ఎన్నికల కమిషనర్ నియామక చట్టం ప్రకారం ప్రధానమంత్రి నేతృత్వంలోని కమిటీ ద్వారా జ్ఞానేష్ కుమార్ అత్యున్నత సీఈసీ పదవికి ఎంపికయ్యారు. ఇప్పుడు విపక్షాల ఒత్తిడికి తలొగ్గి ఆయనను తొలగిస్తే, స్వయంగా ప్రభుత్వం చేసిన నియామక విధానంలోనే తీవ్రమైన లోపం ఉందని అంగీకరించినట్లవుతుంది. అంతేకాకుండా, సీఈసీని ఈ సమయంలో తొలగిస్తే గతంలో ఆయన నేతృత్వంలో జరిగిన సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల పారదర్శకతపై, ప్రభుత్వం సాధించిన విజయాల నైతికతపై కూడా కోలుకోలేని మచ్చ పడే ప్రమాదం ఉంది. అందుకే, బీజేపీ ఈ ఆరోపణలన్నింటినీ ప్రతిపక్షాల రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా కొట్టిపారేస్తూ సీఈసీకి అభయహస్తం ఇస్తోంది.

**ప్రజాస్వామ్యపు గొంతు నొక్కుతున్న పాలకుల నిశ్శబ్దం**

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై వచ్చిన తీవ్రమైన ఆరోపణలపై పారదర్శకమైన విచారణకు సిద్ధపడకపోవడం ద్వారా ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందా అనే తీవ్రమైన అనుమానాలు సగటు పౌరుడిలో బలపడుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల్లో సుప్రీంకోర్టు లేదా ఎన్నికల కమిషన్ వంటి సంస్థలు నిష్పాక్షికంగా పనిచేస్తున్నప్పుడే రాజ్యాంగంపై, దేశ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉంటుంది.అయితే, ఈ వివాదంలో కేవలం ప్రతిపక్షాలే కాకుండా, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమిలోని ప్రధాన భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం పార్టీ (టిడిపి), లోక్ జనశక్తి పార్టీ (ఎల్ జె పి) వంటివి కూడా ఈ అంశంపై బహిరంగ స్పష్టత కోరుతుండటం ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం. ఓటర్లలో ఉన్న అపోహలను, సందేహాలను నివృత్తి చేయడానికి ఎన్నికల కమిషన్ వెంటనే అధికారిక ప్రకటన చేయాలని మిత్రపక్షాలే బహిరంగంగా కోరుతున్నాయంటే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

**విశ్వసనీయత పునరుద్ధరణే ఏకైక పరిష్కార మార్గం**

దేశంలో ఎలాంటి సంక్షోభ పరిస్థితులు తలెత్తినా నిశ్శబ్దం వహించడం లేదా పరస్పరం రాజకీయ ప్రత్యారోపణలు చేసుకోవడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో కలిగిన తీవ్రమైన అనుమానాలను నివృత్తి చేయాల్సిన ప్రాథమిక బాధ్యత రాజ్యాంగ వ్యవస్థలదే. సీఈసీ జ్ఞానేష్ కుమార్ స్వయంగా ముందుకు వచ్చి ఓటర్ల జాబితా నిర్వహణ, సాంకేతిక మార్పులు, కమిషన్ అంతర్గత నిర్ణయాలపై ప్రజలకు, అన్ని రాజకీయ పార్టీలకు పారదర్శకమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారంలోకి ఏ రాజకీయ పార్టీలు వచ్చినా, పోయినా.. వ్యక్తులు ఏ అత్యున్నత పదవుల్లోకి వచ్చి వెళ్లినా..రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య వ్యవస్థల విశ్వసనీయత శాశ్వతంగా నిలబడాలి. ఓటు హక్కు భద్రతపై, ఎన్నికల నిష్పాక్షికతపై దేశ ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషన్ పైనే ఉంది. ప్రజాస్వామ్యాన్ని, ఓటరు హక్కులను రక్షించుకోవడానికి పారదర్శకత ఒక్కటే ఏకైక సరైన పరిష్కారం.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# పెండింగ్ భూభారతి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

- రీ-సర్వే పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి
- అవసరమైతే అటవీ, రెవెన్యూ శాఖల సంయుక్త సర్వేలు నిర్వహించాలి

నిర్మల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారం, భూముల సమగ్ర రీ-సర్వే పురోగతిపై రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకుంటూ ప్రతి దరఖాస్తును అత్యంత పారదర్శకంగా పరిశీలించాలన్నారు. సరిహద్దు వివాదాలు ఉన్న చోట్ల రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సంయుక్త సర్వేలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం




చేశారు. గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే పనులను సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహశీల్దార్లు నిరంతరం పర్యవేక్షిస్తూ రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో మృతి చెందిన శివకుమార్ కుటుంబాన్ని పరామర్శించిన వి. సత్యనారాయణ గౌడ్



నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన ఎంబడి లింగన్న కుమారుడు శివకుమార్ ఇటీవల సాయిబాబా గుడి సమీపంలో వినాయక నిమజ్జనానికి వెళ్లే క్రమంలో హైటెన్షన్ విద్యుత్ తీగ తగిలి మృతి చెందగా, వారి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ్ శనివారం పరామర్శించారు. వారి నివాసానికి చేరుకుని శివకుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్న వయసులోనే కుటుంబ పెద్దను కోల్పోవడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆయన వెంట గురుస్వామి, మాజీ సర్పంచులు శనిగరపు చిన్నయ్య, గంగయ్య, వంజరి నర్సయ్య, రమణ గౌడ్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ

## కలెక్టరేట్‌లో ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు.. ఘన నివాళులు

నిర్మల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూస్వామ్య దోపిడీ, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదిరించి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీ విముక్తి కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఐలమ్మ చరిత్రను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, కార్మిక శాఖ అధికారి రాజలింగు, సహాయ బీసీ అధికారి సత్యనారాయణ, మానవ హక్కుల సంఘం ప్రతినిధి అర్చన, కుల సంఘాల నేతలు పోశెట్టి, గజ్జారాం, గంగాధర్ పాల్గొన్నారు.



# కార్మికులకు కనీస వేతనం రూ. 18,500 అమలు చేయాలి




నిర్మల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ కనీస వేతనం రూ. 18,500 అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఇంద్రానగర్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు పి. గంగామణి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు, ఆశా, అంగన్‌వాడీ, పంచాయతీ, మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. బీడీ కార్మికులకు ఆన్‌లైన్ పెన్షన్ దరఖాస్తులు ప్రారంభించాలని కోరారు. కార్మిక వ్యతిరేక చట్టాల రద్దు కోరుతూ అక్టోబర్ 25, 26 తేదీల్లో చలో హైదరాబాద్, డిసెంబర్ 1 నుంచి 3 వరకు చలో ఢిల్లీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నేతలు బి. సుజాత, గంగాధర్, బి. లలిత, మల్లేష్, చంద్రకళ, లావణ్య, క్లెమెంట్ వెస్లీ పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాల గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు

నిర్మల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (దీ=ూాఖ) పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్, కోఆర్డినేటర్ డాక్టర్ యు. గంగాధర్ తెలిపారు. దూరవిద్య ద్వారా ఉన్నత చదువులు చదవాలనుకునే ఆసక్తి



గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9182568008 నంబరులో లేదా కళాశాల స్టడీ సెంటర్‌లో నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

# గ్రామాల్లో వీబీజీ రామ్‌జీ పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి




దిలావర్‌పూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గ్రామీణాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన వీబీజీ రామ్‌జీ పథకంలోని 375 రకాల పనులను గ్రామాల్లో సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. శనివారం దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సెర్ప్ మరియు వీబీజీ రామ్‌జీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో, ఎంఈవో, ఏపీవో, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# దిలావర్‌పూర్ బాలుర ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీవో గోవర్ధన్



దిలావర్‌పూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహాన్ని మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) గోవర్ధన్ శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, నిత్యావసర సరుకుల నిల్వలు, మెనూ అమలు, భోజన నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహ పరిసరాలు, తాగునీటి సౌకర్యాలు, వంటశాల, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని హాస్టల్ వార్డెన్ మురళిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందాయా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో గ్రామ పంచాయతీ ఈవో మహేందర్ పాల్గొన్నారు.

# అష్ట గ్రామ పంచాయతీకి స్టీల్ కుర్చీల విరాళం

ముధోల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని అష్ట గ్రామ పంచాయతీ కార్యాలయానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి, తెలంగాణ ఉద్యమకారుడు ఏనుగు రాంరెడ్డి, ఆర్మూర్ సంతోష్ రెడ్డిలు



స్వచ్ఛందంగా త్రీ-సీటర్ స్టీల్ కుర్చీలను విరాళంగా అందజేశారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, వీడీసీ పెద్దల సమక్షంలో కుర్చీలను అందజేశారు. గ్రామ అవసరాలకు తోడ్పడిన దాతలను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. ఇతర ప్రముఖులు కూడా గ్రామాభివృద్ధికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు ముత్యం, అజయ్ రెడ్డి, పెంటన్న, రాజన్న, రాజేశ్వర్, భూమేష్, ఉపసర్పంచ్ సావిత్రి పాల్గొన్నారు.

# పర్యాటక రంగంలో సరికొత్త సాంకేతికతపై విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు




నిర్మల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్మల్ పట్టణంలో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. "డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం" అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యాటక రంగంలో ఏఐ, డిజిటల్ టెక్నాలజీ ప్రాధాన్యతను విద్యార్థులు తమ ప్రతిభ ద్వారా చాటారు. విజేతలకు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఈవో దర్శనం భోజన్న, టూరిజం నోడల్ అధికారి శ్రీకాంత్ రెడ్డి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని అధికారులు సూచించారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER